# క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

● నందడిగా చర్చిలు, గృహాలు



విద్యుత్ దీపాల వెలుగుల్లో కర్మెల్ బాపిస్టు చర్చి



శాంతాక్లాజ్ సందడి



అలంకరించిన పశువుల పాక

**కాజీపేట :** నగరంలో క్రిస్మస్ సందడి మొదలైంది. 25వ తేదీ క్రిస్మస్ పండుగను జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమవుతున్నారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ పండుగను క్రైస్తవులు వైభవంగా జరుపుకుంటారు. చర్చిలతో పాటు తమ ఇంటిని రకరకాల అలంకరణతో ఇప్పటికే సుందరంగా ముస్తాబు చేశారు. బాలయేసు ప్రతిమలతో ఊరేగింపులు ప్రారంభమయ్యాయి.

**ఆకట్టుకుంటున్న నక్షత్రాల గుర్తులు..**

యేసు పుట్టిన రోజున ఒక తార ఆకాశంలో వెలిసిందని క్రైస్తవులు నమ్ముతారు. ఇందుకు ప్రతీకగా క్రైస్తవులు ప్రతి ఇంటి, చర్చిల ఎదుట నక్షత్రాన్ని అమర్చి అందులో దీపాన్ని వెలిగిస్తారు. మార్కెట్‌లో నక్షత్రాల ధరలు రూ.100 నుంచి రూ.5వేల వరకు ఉంటాయి.

**అందంగా పశువుల పాక..**

క్రీస్తు పశువుల పాకలో జన్మించాడని, ఆయన పుట్టిన రోజును తలుచుకుంటూ క్రైస్తవులు ఇంటి వద్ద, చర్చిల ఆవరణల్లో పశువుల పాకను ఏర్పాటు చేసుకుంటారు. ఎండుగడ్డితో పాకను నిర్మించి రంగురంగుల వస్తువులతో అలంకరిస్తారు. ఇందులో బాల ఏసు బొమ్మను పడుకోబెడతారు.

**శాంతాక్లాజ్ సందడి..**

క్రిస్మస్ రోజున పిల్లలకు అత్యంత ఇష్టమైనది శాంతాక్లాజ్ (క్రిస్మస్ తాత) ఈ వేషధారణకు ప్రత్యేక దుస్తులను విక్రయిస్తున్నారు. శాంతాక్లాస్‌ను తండ్రి దేవుడిగా భావిస్తారు. క్రీస్తు పుట్టిన ఆనందంలో ఆయన దివి నుంచి దిగి వచ్చి అందరికి బహుమతులు, మిఠాయిలు పంచారని వీరి నమ్మకం.అలాగే సంపదకు గుర్తుగా క్రైస్తవులు ఇంట్లో, చర్చిల్లో పచ్చని ప్లాస్టిక్ చెట్టును ఏర్పాటు చేస్తారు. తమకు సంపదలు ఇవ్వాలని కోరుకుంటూ చెట్టుకు బహుమతుల పెట్టెలలో వివిధ రకాల సంపద సూచికంగా వాడే వస్తువులను వేలాడదీస్తారు. ప్రతీ ఇంట ఓ చెట్టును తప్పకుండా పెడతారు. సంపదలు శబ్ధాలు చేసుకుంటూ ఇంట్లోకి రావాలని కోరుకుంటూ ఇంటి గుమ్మానికి గంటలు ఏర్పాటు చేస్తారు. నగర వ్యాప్తంగా ఉన్న 150కి పైగా చిన్న, పెద్ద చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి.

# ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

● మార్కెట్‌లో రైతులను సన్మానించిన అధికారులు, వ్యాపారులు



రైతులను సన్మానిస్తున్న వ్యాపారులు, అధికారులు

**వరంగల్ :** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పర్యావరణ ఇబ్బందులను, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు మార్కెటింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను లెక్కచేయక మొక్కవోని ధైర్యంతో మానవాళి మనుగడ కోసం శ్రమిస్తున్న అన్నదాతలను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, డీడీఎం వి.పద్మావతి, కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.నిర్మలా, చాంబర్ ఉపాధ్యక్షుడు మొగలి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి సంపత్, మార్కెట్ అధికారులు, వివిధ సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఐఆర్‌ఆర్ బైపాస్ రద్దు చేయాలి

● కలెక్టర్‌కు పైడిపల్లి, ఆరెపల్లి రైతుల మొర



కలెక్టర్‌కు విన్నవిస్తున్న అరెపల్లి, పైడిపల్లి రైతులు

**వరంగల్ :** ఇంటర్నల్ రింగ్ రోడ్ (ఐఆర్‌ఆర్) బైపాస్‌ను రద్దు చేయాలని పైడిపల్లి, ఆరెపల్లి గ్రామాలకు చెందిన రైతులు శ్రీనివాస్, గణేష్, సుధాకర్, శంకరయ్య, సుధాకర్, రాజేశ్వర్‌రావులు సోమవారం కలెక్టర్‌ను కోరారు. కుడా మాస్టర్ ప్లాన్–2041లో ఐఆర్‌ఆర్‌ను 200 ఫీట్లకు వరంగల్ మండల పరిధిలోని పైడిపల్లి, ఆరెపల్లి గ్రామల మీదుగా కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు ప్రతిపాదించారని తెలిపారు. తమ జీవనాధారమైన రెండు పంటలు పండే విలువైన పంట పొలాలు రోడ్డు నిర్మాణం కింద పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే నేషనల్ హైవే 163 నిర్మాణంలో చాలా మంది రైతులు విలువైన పంట భూములు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు సార్లు మ్యాపును మార్చి, వేర్వేరుగా మార్కింగ్ చేయడంపై పలు అనుమానులు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

**నష్టపరిహారం అందించాలి**

ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులకు వెంటనే నష్టపరిహారం అందించాలని ఐఆర్‌ఆర్ భూ బాధితుల సంఘం అధ్యక్షుడు గంగుల దయాకర్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం ప్రజావాణిలో భూ నిర్వాసితులతో కలసి కలెక్టర్‌ను నష్ట పరిహారంపై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు పరిహారం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, నిధులు విడుదలైన వెంటనే అందిస్తామని హామీ ఇచ్చారు. భూనిర్వాసితులు ఉమాశంకర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ఎండీ రియాజ్, రాజనర్సయ్య, లలిత, సాయక్క, సరోజన, ఖిలావరంగల్ ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మెగా రక్తదాన శిబిరం



**మడికొండ :** వంశీరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వంశీరెడ్డి కుమార్తె కంచరకుంట్ల అశ్రితారెడ్డి జన్మదినం సందర్భంగా మడికొండలోని క్వాడ్రంట్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కంచరకుంట్ల మణిమాల మురళీధర్‌రెడ్డి, టీజీఆర్టీసీ హనుమకొండ డిప్యూటీ రీజనల్ మేనేజర్ భాను, డిపో మేనేజర్ మోహన్, ఐఆర్‌సీఎస్ మెంబర్లు పుల్లూరి వేణు, ఈవీవీ శ్రీనివాసు, రమణరెడ్డి, దామోదర్‌రెడ్డి, వేణు మాధవ్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ :** హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (మంగళవారం)విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి తెలిపారు. బస్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### మహిళలకు చీరల పంపిణీ



**కాజీపేట రూరల్ :** కాజీపేట రైల్వే ఏరియాలోని చిల్డ్రన్స్ పార్క్‌లో సోమవారం షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు యమడాల హనుకాంత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 62, 63వ డివిజన్‌ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి, హనుకాంత్ కలిసి క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు హనుకాంత్ తెలిపారు.

### ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా రాంబాబు



**కేయూ క్యాంపస్ :** సిద్దిపేటలో నిర్వహిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో కాకతీయ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి మాచర్ల రాంబాబు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సోమవారం ఏబీవీపీ నాయకులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఏబీవీపీ జాతీయ కార్యవర్గసభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. రాంబాబు ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

### హెచ్‌ఆర్సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్



**వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ కమిటీ (హెచ్‌ఆర్సీ) అధ్యక్షుడిగా కేతిరి రాజశేఖర్‌ను తెలంగాణ అధ్యక్షుడు మెమిన్ బాషా నియమించారు. జాతీయ అధ్యక్షుడు, ఫౌండర్ అయ్యప్ప సోమవారం రాజశేఖర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

### కమిటీ ఎన్నిక



రవీందర్‌రెడ్డి సునీల్‌రెడ్డి

**మడికొండ :** రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి తెలిపారు. సంఘం కార్యదర్శిగా చాడ సునీల్‌రెడ్డి, కోశాధికారిగా మెరుగు హనుమరెడ్డి, ఉపాధ్యక్షులుగా కుందూరు కరుణాకర్‌రెడ్డి, కాసర్ల వసుంధర, చందుపట్ల సత్యనారాయణరెడ్డి, సహా కార్యదర్శులుగా ముద్దసాని పద్మనాభరెడ్డి, లెక్కల రజనీకాంత్ రెడ్డి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

### ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదు



**హసన్‌పర్తి :** మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల జూనియర్ కళాశాల మత మార్పిడిలకు కేంద్రంగా మారిందని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతన శశిధర్ తెలిపారు. సోమవారం కళాశాల కార్యదర్శి రమణకుమార్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు ప్రిన్సిపాల్ వేధిస్తూ మతమార్పిలకు గురి చేస్తోందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. మత మార్పిడి ఇష్టం లేక పలువురు విద్యార్థినులు మధ్యలోనే చదువు నిలిపి వేశారని వివరించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని శశిధర్ కోరారు.

# 'న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి'



మాట్లాడుతున్న సమ్మయ్య, నర్సింగరావు

**నయీంనగర్ :** తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు టీజీఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్, ఎస్‌ఏసీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 26న హనుమకొండ టీటీడీ కల్యాణమండపంలో మహాసభ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వి.సమ్మయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి పీఎల్‌ఎన్ రావు తెలిపారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ పెన్షనర్లు అతి తక్కువ పెన్షన్‌తో దుర్భర జీవితం గడుపుతున్నారని వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. సభకు పెన్షనర్ల ఆల్ ఇండియా నేషనల్ ఎజిటేషన్ కమిటీ అధ్యక్షుడు అశోక్ రా వత్, సెంట్రల్, స్టేట్ కమిటీ సభ్యులు హాజరవుతారని పెన్షనర్‌లు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. బి.నారాయణ, మా ధవ రావు, వెంకటయ్య, సోమిరెడ్డి, సుదర్శన్‌రా వు, కుమారస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

# సీసీఎల్స్ ఇవ్వాలని వినతి



**విద్యారణ్యపురి :** కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్స్ మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాధికారి వాసంతికి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, కోశాధికారి డి.కిరణ్‌కుమార్, కార్యదర్శులు సీఎస్‌ఆర్ మల్లిక్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పీవీ



హన్మకొండ: పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు

● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

**హన్మకొండ :** మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తెలంగాణ ఠీవి అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో భారత రత్న, మాజీ ప్రధాని పీవీ వర్ధంతిని జరుపుకున్నారు. పీవీ చిత్రపటానికి వినయ్‌భాస్కర్, పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. 14 ప్రధాన భాషలు మాట్లాడే బహుభాషా కోవిదుడు అని కీర్తించారు. దేశ ప్రధానిగా సేవలందించిన పీవీ తెలంగాణకు, దేశానికి ఎంతో గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

**పీవీకి ఘన నివాళి**

**హసన్‌పర్తి :** మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత పీవీ నర్సింహారావు వర్ధంతిని 66వ డివిజన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవస్థాన మాజీ చైర్మన్లు జె.రవి, బల్సుకూరి శ్రీనివాస్,గొర్రె కిరణ్, శీలం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..**

66వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పీవీ నర్సింహారావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, నాయకులు బోడ యుగంధర్, రాజేందర్, మేకల రాజేందర్, నాగరాజు, శ్రావణ్, మురళీ, కిరణ్ పాల్గొన్నారు.

**ఆర్టీఏ జంక్షన్‌లో..**

**మామునూరు :** వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో 43వ డివిజన్ బీఆర్‌ఎస్ నేత యాడాల జగపతి బాబా ఆధ్వర్యంలో సోమవారం పీవీ వర్ధంతిని నిర్వహించారు. జయశంకర్, సూరయ్య, సాంబయ్య, క్రాంతి,రాకేష్, ఉదయ్, హరిప్రసాద్ పాల్గొన్నారు

**హనుమాన్‌నగర్‌లో..**

**హన్మకొండ చౌరస్తా :** హనుమకొండ 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్–1కాలనీలో సోమవారం పీవీ నరసింహారావు వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ బాధ్యులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మొట్ల మనోహర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకటేష్, నరేష్, శ్రీకాంత్ , రణదీర్, రాజు, సంపత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హన్మకొండ చౌరస్తా: హనుమాన్‌నగర్ కాలనీలో..

# ముందస్తు క్రిస్మస్ సంబురాలు



ఖిలా వరంగల్: ప్రత్యేక దుస్తుల్లో తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



హన్మకొండ చౌరస్తా: వేడుకల్లో చిన్నారులు



కాజీపేట రూరల్: కేక్ తినుపించుకుంటున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, బిషప్ ఉడుముల బాల



కాజీపేట రూరల్: ఆపిల్ ప్లే స్కూల్‌లో..

కాజీపేట ఫాతిమా బిషప్ హౌజ్‌తో పాటు జిల్లావ్యాప్తంగా సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఓరుగల్లు కథోలిక మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల హాజరయ్యారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు.అలాగే పలు ప్రైవేటు పాఠశాలల్లోను వేడుకలు జరుపుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

# నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలి

**హన్మకొండ అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న జాతీయ నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం పేదలు, బడుగు, బలహీన వర్గాల వారిని చదువుకు దూరం చేసే విధంగా ఉందన్నారు. విద్య కార్పొరేటీకరణకు ప్రభుత్వం సహకరిస్తోందని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో మాస్ సావిత్రి, గుగులోత్ వినోద్, గట్టు సాయి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ఖిలా వరంగల్ :** ఇటీవల వరంగల్ ఓ సిటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో 12 మంది బాలబాలికలు ప్రతిభ చూపారు. కాగా ఈనెల 27, 28 తేదీల్లో గచ్చిబౌలి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికై నట్లు కోచ్ సంజీవకుమార్ తెలిపారు. సోమవారం ఎంపికైన వారికి కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ గోల్డ్ మెడల్స్ అందజేసి అభినందించారు. కోచ్‌లు కల్లెపు సతీష్ చంద్ర, బైరెడి లోహిత్, అభిరాం, మణికంఠ, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, రియాజ్ పాల్గొన్నారు.

**పవర్ లిఫ్టింగ్ పోటీలకు..**

**కేయూ క్యాంపస్ :** కర్ణాటకలోని గుల్బార్గా యూనివర్సిటీలో జనవరి 6 నుంచి 11వ తేదీవరకు జరగబోయే ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి బి.చిన్మయి ఎంపికయ్యారు. సోమవారం కళాశాలలో చిన్మయిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు, కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ తూర్పాటి వెంకటేష్, అకడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పీవీ వైష్ణవి, కె.సాయి, తరుణ్, స్వప్న, సాహితి, రచన, డాక్టర్ ఎన్. వీణ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

**అభినందనలు**

**వరంగల్ :** ఏనుమాముల సుందరయ్యనగర్‌లోని జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు వరంగల్ ఓ సిటీ మైదానంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయి కబడ్డీలో ప్రథమ బహుమతి సాధించారు. సోమవారం పాఠశాల అవరణలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం మంజుల, పీడీని అభినందించారు.

**వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

**హసన్‌పర్తి :** ఈనెల 28, 29, 30వ తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సోమవారం ఎంఆర్ఓ కార్యాలయంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్ ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కిరణ్, మండల అధ్యక్షులు ఎ.శోభారాణి, ప్రధానకార్యదర్శి నరేష్, కోశాధికారి నాగరాజు, కార్యదర్శులు హేమలత, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి**

**న్యూశాయంపేట :** హమాలీ కార్మికులకు ప్రత్యేక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

**జిల్లా నూతన కమిటీ..**

జిల్లా ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగిలి, ప్రధాన కార్యదర్శిగా బి.చక్రపాణి, ఉపాధ్యక్షులుగా పి.అశోక్, సుదర్శన్, విజేందర్, లింగమూర్తి తదితర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో వీర్ బాల దివస్**

**వరంగల్ :** ఏనుమాముల ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వీర్ బాల దివస్ నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ కె.లత తెలిపారు. క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా కావాలని వివరించారు. కార్యక్రమంలో పిల్లలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు ఆయా రమాదేవి పాల్గొన్నారు.

**108 కిలోల కుంకుమతో శ్వేతార్కుడికి అభిషేకం**

**కాజీపేట :** కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభు శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో సోమవారం ధనుర్మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని 108 కిలోల కుంకుమతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తులు సమర్పించిన కుంకుమతో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు.

**పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

**విద్యారణ్యపురి :** ప్రభుత్వ పాఠశాలల్లో వంటచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సందర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అభిషేక్, రాకేష్, శ్రీను పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ఈవ్‌టీజింగ్ కేసు నమోదు**

**మడికొండ :** ఒకరిపై ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ కిషన్ తెలిపారు. మడికొండకు చెందిన ఆకుల అఖిల్‌కు గతంలో పెళ్లి కాగా విడాకులయ్యాయి. ఈక్రమంలో మరొకరిని ప్రేమించి మోసం చేశాడు. కాగా ఇదే గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని వెంటపడుతూ ప్రేమిస్తున్నానని, ప్రేమించకుంటే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసునమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

**ఖిలా వరంగల్ :** హనుమకొండకు చెందిన దామోదర్‌రెడ్డి సోమవారం కారులో వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్నాడు. కళ్లకు చీకట్లు కమ్ముకోవడంతో ఉర్సుగుట్ట రోడ్డు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో కారు అదుపు తప్పి డీవైడర్, సెంట్రల్ లైటింగ్ పోల్‌ను ఢీకొట్టింది. దీంతో దామోదర్‌రెడ్డికి గాయాలయ్యాయి.

**మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేయాలి**

**వరంగల్ :** ఫిర్యాదు దారుల పట్ల పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్న మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను బదిలీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రేటర్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని తెలిపారు.

**కమ్యూనిటీ హాల్ నిర్మించాలి**

**వరంగల్ :** మట్టెవాడలోని పాత సీసీఎస్ స్థలంలో బీసీ కమ్యూనిటిహాల్, మహిళా భవన్ నిర్మించాలని మట్టెవాడ హరిహరపుర అభివృద్ధి కమిటీ (పాత సీసీఎస్ వీధి) అధ్యక్షుడు తోట వేణు, కాలనీకి చెందిన ప్రజలు సోమవారం మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారదా, మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేలకు వినతి పత్రాలు సమర్పించారు.

**క్రీడలతో మానసికోల్లాసం**

**హసన్‌పర్తి :** క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతోందని గ్రీన్‌వుడ్ పాఠశాల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు అన్నారు. పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహించనున్న 'వింటర్ స్పోర్ట్స్ కార్నివాల్'ను సోమవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడ స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుకుమార్, నవీన్ కుమార్, పవన్‌కుమార్, సురేష్‌కుమార్, రబ్బానీ, శాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**'నాగరాజుపై దాడి సరికాదు'**

**ఖిలా వరంగల్ :** దళిత నాయకుడు సుద్దాల నాగరాజుపై దాడి చేయడం సరికాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల ప్రతినిధులు మైదం రవి, బాబు, జన్ను ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఖిలా వరంగల్ పడమరకోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నేతలు నిరసన వ్యక్తం చేశారు.


**పుడమిపుత్ర అవార్డు ప్రదానం**

**హన్మకొండ కల్చరల్ :** సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ ఆధ్వర్యంలో అందించే పుడమిపుత్ర అవార్డును నగరానికి చెందిన ఇమ్మడిశెట్టి ప్రభాకర్ రావు, రమణ దంపతులకు ప్రదానం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ కమిషనర్ పాల్గొన్నారు. మిద్దెతోట సాగుదారుల కేటగిరిలో ప్రభాకర్‌రావు, రమణ దంపతులకు పుడమిపుత్ర అవార్డును ప్రదానం చేశారు.

**'ఎలాంటి ప్రతిపాదన చేయలేదు'**

**నయీంనగర్ :** 'రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు' కథనానికి ఎన్పీడీసీఎల్ డీఈ(ఆపరేషన్) జి.సాంబ రెడ్డి వివరణ ఇచ్చారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలు మార్చడానికి జీడబ్ల్యూఎంసీ, 'కుడా' అధికారులు, ఎన్పీడీసీఎల్ అధికారులు ఎలాంటి ప్రతిపాదన చేయలేదన్నారు. భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే సిమెంట్ రోడ్డు వేసిన అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఎన్పీడీసీఎల్ అధికారులకు ఎలాంటి బాధ్యత ఉండదని తెలిపారు.

# కార్మిక భవన్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**వరంగల్ :** అజంజహి మిల్లు కార్మిక భవన్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మేయర్ టి.రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని కార్మిక భవన్‌ను అక్రమంగా కూల్చి, అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి, నాయకులు సముద్రాల పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.